
సాక్షి
పల్నాడు
సోమవారం, 13, జనవరి, 2025



పొనుగుపాడులో పోలీస్ పికెట్

ఫిరంగిపురం: పొనుగుపాడులో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు పికెట్ ఏర్పాటుచేశారు. చర్చి సమీపంలోని గోడను శనివారం పొక్లెయిన్‌తో కూల్చివేసిన విషయం విదితమే.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 564.70 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 9,800 క్యూసెక్కులు వదిలారు.

రాహు-కేతు పూజలు



నకరికల్లు: మండలంలోని నర్సింగపాడు గ్రామంలో గల అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రాహు-కేతు పూజలు నిర్వహించారు. భక్తులు మొక్కులు చెల్లించారు.

న్యూస్‌రీల్

స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద



నగరంపాలెం: ప్రతి ఒక్కరూ భగవద్గీతను దైనందిన కార్యక్రమాల్లో ఆచరించాలని ఆధ్యాత్మికవేత్త శ్రీ ధనేశ్వర దాస్‌గోస్వామి (యూఎస్‌ఏ) అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలోని గుంటూరు బార్ అసోసియేషన్ హాల్‌లో ఆదివారం స్వామి వివేకానంద జయంతి వేడుకలు నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ధనేశ్వరదాస్ గోస్వామి మాట్లాడుతూ ప్రపంచానికి భగవద్గీత అవసరం ఉందని అన్నారు. అన్ని సమస్యలకు పరిష్కారం దాని ద్వారా లభిస్తుందని తెలిపారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌జీబీ పార్థసారథి మాట్లాడుతూ.. స్వామి వివేకానంద అందరికీ స్ఫూర్తి ప్రదాత అన్నారు. కార్యక్రమంలో మురారి దాస్ స్వామి, నిర్వికల్పానంద స్వామి, బార్ అధ్యక్షులు కాసు వెంకటరెడ్డి, ఏపీ బార్ కౌన్సిల్ సభ్యులు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, ఉపాధ్యక్షుడు గౌరీశంకర్, మాజీ ఉపాధ్యక్షుడు జి.శాంతకుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.

మంత్రి వ్యవసాయ క్షేత్రంలో భోగి మంటలు



తెనాలిరూరల్: రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలను ఘనంగా ప్రారంభించారు. మండలంలోని పెదరావూరు గ్రామంలో మనోహర్‌కు గల వ్యవసాయ క్షేత్రంలో భోగి వేడుకలను ఆదివారం ప్రారంభించారు. మంత్రి భోగి మంటలను వెలిగించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేడు గ్రీవెన్స్ రద్దు

నరసరావుపేట: భోగి పండుగ సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)ను రద్దుచేసినట్లు కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనిని ప్రజలు గమనించాలని కోరారు.

పోలీస్ గ్రీవెన్స్..

నరసరావుపేట: ప్రతి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)ను భోగి పండగ సందర్భంగా రద్దుచేసినట్లు ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా ప్రజలు గమనించాలని కోరారు.

51,059 హెక్టార్లలో రబీ పంటల సాగు

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో రబీ పంటల సాధారణ సాగు 70,324 హెక్టార్లు కాగా, ఇప్పటి వరకు 51,059 హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. గత అక్టోబర్ మూడవ వారం నుంచి రబీ సీజన్ ప్రారంభమైంది. జిల్లాలో వరి సాధారణ సాగు 854 హెక్టార్లు కాగా.. ప్రస్తుతం 771 హెక్టార్లలో నాట్లు వేశారు. జొన్న 19,130కుగాను 7,781, మొక్కజొన్న 20,386కుగాను 14,850, కంది 54కుగాను 149, పెసర 10,516కుగాను 5,177, మినుము 5,833కుగాను 5,406, మంచిశనగ 7,970కుగాను 6,289, పొగాకు 924కుగాను 3,369 హెక్టార్లలో సాగు చేశారు. మిరప 6,978, పండ్ల తోటలు 7, కూరగాయలు 157, ఉల్లి 69, ఇతర పంటలు 56 హెక్టార్లలో సాగు చేశారు.

గోదాదేవికి సారె సమర్పణ



తాడేపల్లి రూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని బాపూజీ విద్యాలయంలో త్రిదండి చిన్నజీయర్ స్వామి పర్యవేక్షణలో నిర్వహిస్తున్న ధనుర్మాస మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారంతో ఈ ఉత్సవాలు 28వ రోజుకు చేరుకున్నాయి. సుమారు 170 మంది భక్తులు గోదా అమ్మకు సారె సమర్పించారు. చిన్నజీయర్ స్వామి వారికి మంగళాశాసనాలు అందజేశారు. కార్యక్రమాల్లో ఆంధ్రప్రదేశ్ ఇంటెలిజెన్స్ డిపార్ట్‌మెంట్ డీజీ రామకృష్ణ పాల్గొన్నారు.

జగనన్న ఉంటేనే సంక్రాంతికి శోభ..



ప్రజలందరూ ప్రభుత్వ పథకాల కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పటి వరకు ఒక్క పథకాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేయలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి నెలా ఏదో ఒక పథకం ద్వారా జనాల వద్దకు డబ్బులు వచ్చేవి. దీని వలన అందరూ ప్రతి పండగను సంతోషంగా జరుపుకునేవారు. నేడు డబ్బులు లేకపోవడంతో సందడి అంతగా లేదు. ప్రజల కొనుగోలు శక్తి లేక వ్యాపారాలు సాగడం లేదు.

– కలుమూరి గాయత్రి, కిరాణా షాపు, ఉప్పలపాడు

పనుల్లేక వలసలు వెళ్లారు



గ్రామంలో పనులు లేకపోవడంతో దాదాపు వందమంది పొగాకు బ్యారన్‌లో పనికోసం ప్రకాశం జిల్లాకు వలస వెళ్లారు. ఇళ్ల వద్ద వృద్ధులు, పిల్లలు మాత్రమే ఉంటున్నారు. ఈ ఏడాది పంటలు కూడా సరిగా లేవు. పత్తిలో నష్టాలు వచ్చాయి. మిర్చి ధరలు బాగా తగ్గిపోయాయి. వరిని అంతగా సాగు చేయలేదు. వలసల వలన సంక్రాంతి పండగ వాతావరణం కనిపించడం లేదు.

– వడ్డే వీరాంజనేయులు, ఉప్పలపాడు

నాటి పండగ శోభ నేడు లేదు



సంక్రాంతి పండగ అంటేనే గతంలో ఒక ఉత్సాహం వచ్చేది. బంధుమిత్రులతో గ్రామం కళకళలాడేది. స్నేహితులందరం కలిసే అవకాశం కలిగేది. ఈ ఏడాది పెరిగిన నిత్యావసర ధరలు, పంటల దిగుబడులు అంతంత మాత్రంగా ఉండటం, ప్రభుత్వం పథకాల అమలు చేయకపోవడంతో తీవ్ర ఆర్థిక సమస్యల్లో ప్రజలు చిక్కుకున్నారు. పండగ చేసుకునే పరిస్థితుల్లో లేరు. సంక్రాంతికి సొంతూరుకు వచ్చామన్న ఆనందం అసలే లేకుండా పోయింది.

– నంద్యాల ఆదిలక్ష్మి, నరసరావుపేట

సంక్షేమం రాదు.. సంక్రాంతి లేదు

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్


ఉప్పలపాడులో కళ తప్పిన సంక్రాంతి

ఉప్పలపాడు గ్రామ సచివాలయం



పల్లె ముంగిళ్లలో ఆనందాల రంగవల్లులు.. వాకిళ్లలో సిగన విరులు సింగారించుకున్న గొబ్బెమ్మల అందాలు.. వాటి ముందు డూడూ బసవన్నల కేరింతలు.. ఇల్లంతా మధుర వంటకాల ఘుమఘుమలు.. కొత్త అల్లుళ్లు.. బంధుగణం సరదాలు.. సపరివారసమేతంగా 'సిరి' నవ్వులు చిందిస్తూ ప్రతి సక్రాంతికి బోలెడు ఊసులు కలబోసుకునే ఊరు.. ఇప్పుడు బోసిపోయింది. నవ్వుల్లేక మూగబోయింది. ఊసులన్నీ గుండెల్లో తుల్లోనే ఉసూరుమంటూ 'ఊరు'కుండిపోయాయేమో.. కళ తప్పి కాంతివిహీనమైంది. 'సాక్షి' ఆదివారం జరిపిన పరిశీలనలో ఈ విషయాలు వెల్లడయ్యాయి.

- గతంలో పండగొచ్చిందంటే ఊరంతా సంబరమే
- పిండివంటలు, కొత్త వస్త్రాలు, బంధువుల రాకతో కోలాహలం
- గత ప్రభుత్వ పాలనలో రూ.4.55 కోట్లతో అభివృద్ధి పనులు
- సంక్షేమ పథకాల ద్వారా రూ.20.82 కోట్ల లబ్ధి
- ఈ ఏడాది కనిపించని గత వైభవం
- కానరాని పెద్ద పండగ సందడి
- సంక్షేమ పథకాలు అందక, రైతులకు ఆదాయం లేక బోసిపోయిన పల్లె
- చేతిలో చిల్లిగవ్వ లేందంటూ గ్రామీణుల ఆవేదన



నరసరావుపేట రూరల్ మండలం ఉప్పలపాడు గ్రామం ఏరియల్ వ్యూ

సాక్షి, నరసరావుపేట, నరసరావుపేటరూరల్: నరసరావుపేట రూరల్ మండలంలోని గుంటూరు-కర్నూలు హైవేకు ఆనుకొని ఉన్న ఉప్పలపాడు గ్రామంలో సుమారు 1,300 ఇళ్లు ఉండగా 4,578 మంది జనాభా ఉన్నారు. వ్యవసాయాధారిత ఊరు. ఉప్పలపాడులో ఎక్కువగా వరి, పత్తి, మొక్కజొన్న, కూరగాయలు, మిర్చి పంటలను పండిస్తారు. ఈ గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో సుమారు రూ.4.55 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు జరిగాయి. గ్రామ సచివాలయం, ఆర్‌బీకే కేంద్రం, వైఎస్సార్ విలేజ్ హెల్త్ సెంటర్, సీసీ రోడ్లు, సీసీ డ్రైయిన్ల పనులతో ఊరు ప్రగతి బాటన పయనించింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ద్వారా గ్రామస్తులకు సుమారు రూ.20.82 కోట్ల మేర లబ్ధి చేకూరింది. మరోవైపు పంటలు బాగా పండి దిగుబడి వచ్చి రైతుకు గిట్టుబాటు ధర లభించడంతో పెద్ద పండగ సంక్రాంతికి ఊరు ఊరంతా సంబరం జరిపేది. బంధువులు, బయట ప్రాంతాల్లో విద్య, ఉద్యోగాల కోసం వెళ్లిన వారి రాకతో ఊరిలో సందడి నెలకొనేది. నూతన వస్త్రాలు, పిండి వంటలతో ప్రతి ఇల్లూ కళకళలాడేది. అప్పట్లో సంక్రాంతి కళ అంతా ఉప్పలపాడులోనే కనిపించేది.

ఉప్పలపాడు గ్రామ సమాచారం

జనాభా:	4,578
పురుషులు:	2,265
స్త్రీలు:	2,313
ఓటర్లు:	3,420



ఈ ఏడాది సంక్రాంతి పండగ కళ తప్పిందని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. పేద, మధ్య తరగతి ప్రజల వద్ద కొనుగోలు శక్తి లేక కొత్త వస్త్రాలు, పిండి వంటలకు సామగ్రి కొనడం కూడా ఇబ్బందికరంగా మారిందని చెబుతున్నారు. అకాల వర్షాలతో పంటలు దెబ్బతిన్నా.. ఈ ఏడాది కూటమి ప్రభుత్వం ఆదుకోలేకపోయిందని, గిట్టుబాటు ధర లభించలేదని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు సంక్షేమ పథకాల లబ్ధి ఆగిపోవడం, నిత్యావసరాల ధరలు ఆకాశన్నంటడంతో పండగ చేసుకునేందుకు చేతిలో చిల్లిగవ్వలేకపోయిందని ప్రజలు కన్నీరుమున్నీరవుతున్నారు. గత ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా ప్రతి నెలా ఏదో ఓ రూపంలో పేదోడి బ్యాంక్ ఖాతాలో నగదు జమ అవుతూ ఉండేదని గుర్తు చేసుకుంటున్నారు. అప్పట్లో సగటున ఏడాదికి ఉప్పలపాడు గ్రామస్తుల ఖాతాల్లో రూ.4 కోట్ల దాకా జమయ్యేవని జ్ఞప్తికి తెచ్చుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఒక్క పథకమూ అందలేదని చెబుతున్నారు. అందుకే పండగ సందడి లేదని, కొత్త దుస్తులు కొనుక్కునేందుకు దిక్కులేక పోయిందని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. గత ప్రభుత్వంలో గ్రామంలో నిర్మించిన ఆర్‌బీకే, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను కూటమి ప్రభుత్వం వినియోగంలోకి తీసుకురాలేక పోయిందని విమర్శిస్తున్నారు.

ఏదీ గత వైభవం..

పండగ సందడి లేదు



గతంలో సంక్రాంతి పండగ వస్తుందంటే గ్రామంలో సందడిగా ఉండేది. వారం రోజుల ముందు నుంచే పిండివంటల తయారీ, బంధువుల రాకలు ఉండేవి. అందరూ ఎంతో ఉత్సాహంగా ఉండేవారు. ఈ ఏడాది గ్రామంలో సంబరం కనిపించడం లేదు. ఎవరి పనులు వారు చేసుకుంటున్నారు తప్పించి పండుగ వాతావరణం కనిపించం లేదు.

– మహిపతి ఏడుకొండలు, రైతు, ఉప్పలపాడు

ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాం



గత ప్రభుత్వ హయాంలో ఏటా సంక్రాంతికి ముందు ఏదో ఒక పథకం ద్వారా డబ్బులు వేసేవారు. దీంతో అందరి ఇళ్లలో పండగను ఘనంగా జరుపుకునేవాళ్లం ఈ ప్రభుత్వంలో ఇప్పటి వరకు ఒక్క పథకంలో కూడా నగదు వేయలేదు. దీంతో సామాన్య, పేద వర్గాలకు చెందిన వాళ్లు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. దీని వల్ల పండగ శోభ తగ్గింది.

– యన్నం రమాదేవి, గృహిణి, ఉప్పలపాడు

'ఈనాడు'పై పరువు నష్టం దావా వేస్తా

- వాస్తవాలు ఏమిటో తెలుసుకోకుండా నాపై బురద జల్లుతున్నారు
- వ్యక్తిత్వ హననమే ధ్యేయంగా వార్తలు రాయటం ఇది మూడోసారి
- ఆక్రమణకు గురైందని మహిళ చెబుతున్న స్థలం మార్కెట్‌యార్డుది
- విలేకర్ల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



నరసరావుపేట: కనీసం విచారణ చేయకుండా తనపై తప్పుడు ఆరోపణలతో వ్యక్తిత్వ హననమే ధ్యేయంగా పదే పదే వార్తలు రాస్తున్న ఈనాడు దినపత్రికపై పరువు నష్టం దావా వేస్తానని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. నరసరావుపేటలోని గుంటూరు రోడ్డులో ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గోపిరెడ్డి ఆదివారం మాట్లాడారు. తొమ్మిదో వార్డుకు చెందిన వెంకాయమ్మ అనే మహిళ తనపై ఆరోపణలు చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి అర్జీ ఇస్తే అందులోని వాస్తవాలను గ్రహించకుండా ఈనాడు దినపత్రిక ప్రచురించడం తగదని గోపిరెడ్డి పేర్కొన్నారు. అసలు ఈ ఉదంతం వెనుక ఉన్న వాస్తవాలను ఆయన వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. ''ఆర్టీసీ బస్టాండ్‌కు ఎదురుగా ఉన్న మార్కెట్‌యార్డు స్థలంలో 2012లో షాపులు నిర్మించారు. ఇప్పటివరకు ఆ షాపులు ఎవరు అధికారంలోకి వస్తే వారి చేతులలోకి మారడం ఆనవాయితీగా వస్తోంది. ఈ కాంప్లెక్స్‌కు పక్కనే ఉన్న బార్ అండ్ రెస్టారెంట్ వైపున ఉన్న కొద్దిపాటి స్థలంలో సైకం లక్ష్మీరెడ్డి అతని సోదరుడు బంకు పెట్టుకుని వ్యాపారం చేస్తున్నారు. అప్పుడు వారు కాంగ్రెస్ పార్టీలో ఉండగా, ప్రభుత్వం మారగానే వారి వద్ద నుంచి టీడీపీ వారు తీసుకొని వెంకాయమ్మకు కేటాయించారు. ఆ మహిళ తిరిగి ఈ స్థలాన్ని లక్ష్మీరెడ్డి, అతని సోదరుడికే రూ.10వేలకు అద్దెకి ఇచ్చి ఐదేళ్లపాటు అద్దె తీసుకున్నారు. మళ్లీ 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలో రాగానే ఆ పార్టీ వర్గీయుల చేతిలోకి స్థలం వెళ్లింది. 2024లో టీడీపీ అధికారంలో రాగానే ఎన్నికలకు ముందు ఆ పార్టీలో చేరిన సైకం లక్ష్మీరెడ్డి అతని సోదరుడు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ద్వారా స్థలాన్ని దక్కించుకున్నారు. దీంతో వెంకాయమ్మ ఎమ్మెల్యేను కలిసినా ప్రయోజనం లేకపోయింది.'' అని గోపిరెడ్డి వివరించారు.

తరచూ ఎల్లో మీడియా అతి

ఈ విషయాలన్నీ ప్రస్తావించకుండా వెంకాయమ్మ టీడీపీ రాష్ట్ర కార్యాలయానికి వెళ్లి సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేస్తే అందులోని వాస్తవాలను విచారించకుండా తనపై అవాస్తవ కథనాన్ని ఈనాడు ప్రచురించిందని గోపిరెడ్డి ధ్వజమెత్తారు. అసలు ఆ స్థలం ప్రభుత్వానిదని, దానిని కేటాయించే హక్కు ఎవరికీ లేదని స్పష్టం చేశారు. ఆ స్థలంలో ప్రస్తుతం వ్యాపారం చేస్తున్న వారు తన అనుచరులంటూ ఈనాడు పత్రిక చేసిన ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదన్నారు. గతంలోనూ ఎల్లో మీడియా తనపై మూడుసార్లు విషం చిమ్మిందని, నిరాధార వార్తలు రాసిందని ఆవేదన వ్యక్తం చేశారు. పచ్చ మీడియా అతి చేస్తోందని, తప్పకుండా న్యాయపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. టీడీపీ రాష్ట్ర కార్యాలయానికి వస్తున్న అర్జీలలో 90శాతం అబద్ధపు అర్జీలేనని విమర్శించారు. సీఎంకు ఫిర్యాదు చేసిన వెంకాయమ్మకు మార్కెట్ యార్డులో స్థలం కేటాయించిన పట్టా, డాక్యుమెంట్ ఉంటే ఆమె పోలీస్‌స్టేషన్, ఎస్పీ, ఎమ్మెల్యే వద్దకు వెళ్లి ఫిర్యాదు ఇవ్వాలని సూచించారు.

బరిలో రంగ హరి..!

- యథేచ్ఛగా కోడి పందేలు
- తగ్గేదే లే అంటున్న జూదరులు
- కూటమి నేతల అండదండలు పుష్కలం
- పార్కింగ్ నుంచి గుండాట, మూడుముక్కలాటలకు ప్రత్యేకంగా వసూళ్లు
- కన్నెత్తి చూసేందుకూ సాహసించని పోలీసులు, రెవెన్యూ శాఖ అధికారులు



మూసాపురం గ్రామంలో కోడి పందేలు నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన బరులు

పెదకూరపాడు: సంక్రాంతి పండగ ముసుగులో కోడి పందేలకు జూదరులు సిద్ధమవుతున్నారు. ఎన్ని నిబంధనలు పెట్టినా తగ్గేదే లేదు అంటున్నారు. కోళ్లకు కత్తి కట్టి పందేలు వేయాల్సిందే అంటూ తొడలు కొడుతున్నారు. కూటమి నేతల అండదండలు పుష్కలంగా ఉన్నాయని రెచ్చిపోతున్నారు. బరుల వద్ద మూడుముక్కలాట, గుండాటలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పెదకూరపాడు నియోజకవర్గంలోని పెదకూరపాడు మండలం బుసాపురం, అమరావతి మండలం మల్లాది గ్రామాల్లో పెద్ద ఎత్తున బరులను సిద్ధం చేశారు. పందెం కోళ్లనూ మేపుతున్నారు. బరుల వైపు పోలీసులు కన్నెత్తి చూడకుండా టీడీపీ జెండాలూ కడుతున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

పట్టించుకోని పోలీసులు

నిబంధనలకు విరుద్ధంగా కోడి పందేలు నిర్వహించేందుకు బరులను సిద్ధం చేస్తున్నా.. పోలీసులు పట్టించుకోవడం లేదు. కూటమి నేతల ఒత్తిళ్లతోపాటు నిర్వాహకులు మామూళ్లతో ఊరిస్తుండడంతో పోలీసులు నిద్ర నటిస్తున్నట్టు విమర్శలు ఉన్నాయి. కనీసం అడ్డుకునే యత్నం కూడా చేయటం లేదు. కోడి పందేల బరుల వద్ద గుండాట, మూడు ముక్కలాటలు వేసుకునేందుకు నిర్వాహకులు రూ.లక్షల్లో వసూలు చేసినట్టు తెలుస్తోంది. ఇటీవల పాటిబండ్లలో జరిగిన ముగ్గురు రాజుల ఆలయం తిరునాళ్లలోనూ పెద్ద ఎత్తున మూడు ముక్కలాట, గుండాటలు జరిగినా పోలీసులు చోద్యం చూస్తూ ఉండిపోయారు. నిర్వాహకులు పోలీసులకు, కూటమి నేతలకు భారీగా ముడుపులు ముట్టజెప్పినట్టు ఆరోపణలు ఉన్నాయి. కోడి పందేలను సహించేది లేదని, బరులు వేస్తే తొలగిస్తామని ప్రకటనలు గుప్పిస్తున్న పోలీసులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా పోలీసు శాఖ స్పందిస్తుందో లేదో వేచి చూడాలి.

సజావుగా పండగ చేసుకుందాం

ఎస్పీ కంచి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట: సంప్రదాయబద్ధంగా, సజావుగా సంక్రాంతి పండగ చేసుకుందామని, జిల్లా ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్పీ కంచి శ్రీనివాసరావు కోరారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. సంక్రాంతి సెలవులకు ఇళ్లకు తాళాలు వేసి ఊర్లకు, విహార, తీర్థ యాత్రలకు వెళ్లేవారు పోలీసులకు తెలియజేయాలని, ఎల్‌హెచ్‌ఎస్ ద్వారా ఆ ఇళ్ల వద్ద గస్తీ ఏర్పాటు చేస్తామని ఎస్పీ పేర్కొన్నారు. ఊళ్లకు వెళ్లేవారు ఇంటిలోని విలువైన ఆభరణాలు, వస్తువులను బ్యాంకు లాకర్లలో దాచుకోవాలని సూచించారు. కోడి పందేలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు యువత దూరంగా ఉండాలని హితవు పలికారు. ఎక్కడైనా జూదాలు జరుగుతుంటే సంబంధిత పోలీస్ స్టేషన్‌కుగానీ, డయల్ 112కు గానీ కాల్‌చేసి సమాచారం అందించాలని కోరారు. ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

31 నుంచి బాల మహోత్సవ్-2కే25

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో చిన్నారుల కోసం మొట్టమొదటి సారిగా రాష్ట్రస్థాయి బాల మహోత్సవ్ కార్యక్రమాన్ని జనవరి 31వ తేదీ నుంచి రెండు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ మేరకు వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్ ఆదివారం తెలిపారు. ''విజ్ఞాన్ బాల మహోత్సవ్-2కే25'' పేరిట పోస్టర్లను చైర్మన్ లావు రత్తయ్య ఆవిష్కరించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ.. చిన్నారులు ప్రతిభ చాటేందుకు ఈ మహోత్సవ్ వేదికగా నిలుస్తుందని తెలిపారు. జూనియర్స్ (5 - 7), సీనియర్స్ (8 - 10వ తరగతి వరకు) విద్యార్థులకు మొత్తం 50కు పైగా ఈవెంట్లు నిర్వహించనున్నట్లు వివరించారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, పరు గు పందేలు, మ్యూజిక్, డ్యాన్స్, లిటరరీ, ఫైన్ ఆర్ట్స్ తదితర అంశాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు.

'రేషన్ మాఫీ'యాపై విచారణ



ఈనెల 11న సాక్షి దినపత్రిలో ప్రచురితమైన కథనం



రేషన్ బండి వద్ద విచారిస్తున్న రెవెన్యూ అధికారులు

సాక్షి ఎఫెక్ట్

పిడుగురాళ్ల: రేషన్ బియ్యంకు బదులు నగదు ఇస్తామని బెదిరింపులకు దిగిన ఘటనపై అధికారులకు శనివారం రాత్రి విచారణ చేపట్టారు. ఈనెల 11న సాక్షి దినపత్రికలో రేషన్ 'మాఫీ'యా అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి రెవెన్యూ ఉన్నతాధికారులు స్పందించారు. విచారణకు ఆదేశించారు. దీంతో రెవెన్యూ సిబ్బంది పిడుగురాళ్ల 11వ వార్డులోని బ్రహ్మానందరెడ్డి కాలనీలో నివసిస్తున్న రేషన్ కార్డు లబ్ధిదారులను శనివారం రాత్రి విచారణ చేశారు. రేషన్ బండి ఏ సమయంలో వస్తుందో తెలియడం లేదని, అంతా పనులకు వెళ్లే సమయంలో వస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు. తాము పేదలమని, రేషన్ బియ్యమే ఆధారమని, కానీ బియ్యానికి బదులు డబ్బులిస్తామని చెబుతున్నారని, డబ్బులు వద్దంటే దిక్కునచోట చెప్పుకోవాలని బెదిరిస్తున్నారని వివరించారు. అధికారులు లబ్ధిదారుల వద్ద స్టేట్‌మెంట్ తీసుకొని నివేదికలను ఉన్నతాధికారులకు అందిస్తామని చెప్పి వెళ్లారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్స్ డీటీ సుబ్బారావు, ఆర్‌ఐ శ్రీనివాసరావు, వీఆర్వో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గొప్ప సేవకుడు రంగారావు

రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



రంగారావును సత్కరిస్తున్న ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్



స్వర్ణోత్సవ పైలాన్ వద్ద మంత్రి గొట్టిపాటి రవికుమార్ తదితరులు

చిలకలూరిపేటటౌన్: సమాజ సేవలో ఐదు దశాబ్దాల పాటు తరించిన ఆదర్శప్రాయుడు డాక్టర్ జాస్తి రంగారావు అని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కొనియాడారు.. పట్టణానికి చెందిన అసిస్ట్ స్వచ్ఛంద సేవాసంస్థ స్వర్ణోత్సవాలు ఆదివారం ముగిశాయి. ముఖ్య అతిథిగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ అసిస్ట్ పేరిట 50 ఏళ్ల కిందట ఏర్పాటు చేసిన ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారా విద్యా, వైద్యం, నీరు, వసతి వంటి అన్ని రంగాల్లో పారదర్శక సేవలు రంగారావు అందించడం విశేషమన్నారు. అసిస్ట్ సంస్థ చేసిన సేవా కార్యక్రమాల వివరాలు, చిత్రాలు చూసి మంత్రి అభినందించారు. రంగారావు స్ఫూర్తితో ఆయన కొడుకూ సమాజ సేవకు అంకితం కావడం అభినందనీయమన్నారు. అంతకుముందు మంత్రి సంస్థ 50 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన పైలాన్‌ను ఆవిష్కరించారు. అనంతరం రంగారావు దంపతులను సత్కరించారు. ఇంకా ఈ కార్యక్రమానికి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణ, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ వేర్వేరు సమయాల్లో వచ్చి అసిస్ట్ సేవలను కొనియాడి రంగారావును సత్కరించారు. కార్యక్రమంలో అసిస్ట్ అధ్యక్షుడు వడ్లమాని రవి, డైరెక్టర్ జాస్తి కృష్ణ హరీష్, డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు, ముత్తినేని వెంకటేశ్వర్లు, తేళ్ల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్విమ్మింగ్‌లో జగదీష్‌కు రన్నర్స్ ట్రోఫీ



నరసరావుపేట ఈస్ట్: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆత్రేయపురంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ స్విమ్మింగ్ పోటీలలో శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల విద్యార్థి ఎస్.జగదీష్ రన్నర్స్ ట్రోఫీ సాధించినట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్, వ్యాయామ అధ్యాపకుడు డాక్టర్ యక్కల మధుసూదనరావు ఆదివారం తెలిపారు. అలాగే 4+100 మీటర్ల ఫ్రీస్టైల్ విభాగంలో రజిత పతకం సాధించినట్టు వివరించారు. విద్యార్థి జగదీష్‌ను కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయగుప్త, ప్రిన్సిపల్ డాక్టర్ సుధీర్, వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాససాయి, కోచ్ జి.సురేష్ అధ్యాపకులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



నరసరావుపేట రూరల్: రావిపాడు వద్ద శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. చిలకలూరిపేట పట్టణానికి చెందిన గాదె అంజిరెడ్డి(40) తన స్నేహితులు ముగ్గురితో కలిసి కారులో చెన్నైకి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో రాజుపాలెంలో తన స్నేహితుడిని వదిలి నకరికల్లు మీదుగా చిలకలూరిపేటకు ప్రయాణమయ్యారు. రావిపాడు సమీపంలో వీరు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పింది. రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టి పంట కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో అంజిరెడ్డి మృతిచెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్వరజ్యోతి నాగమణికి మరో ప్రతిష్టాత్మక పురస్కారం



అవార్డు అందుకుంటున్న రావినూతల నాగమణి (పాతచిత్రం)

శావల్యాపురం: మధుర గానంతో అందరి మన్ననలు పొంది 2023లో అంతర్జాతీయ స్వరజ్యోతి అవార్డు దక్కించుకున్న రావినూతల నాగమణి(హర్షారాక్స్) మరో ప్రతిష్టాత్మక పురస్కారానికి ఎంపికయ్యారు. నాగమణిది శావల్యాపురం మండలం కారుమంచి గ్రామం. ఆమెది సాధారణ కుటుంబం. చిన్నానాటి నుంచి సంగీతంపై మక్కువ. కొత్త సంగీత యాప్‌ను రూపొందించి అనతికాలంలోనే 2.25 లక్షల మంది ఫాలోవర్స్‌ను సంపాదించారు. తెలుగు కన్నడ, మలయాళ హిందీ భాషల్లో 15 వేలకుపైగా సినీ గేయాలను పాడారు. అనేక అవార్డులు పొందారు. తాజాగా తెలుగు సాహిత్య, సాంస్కృతిక తెలుగు కళలు పరిరక్షణ, అకాడమీ, బుక్ ఆఫ్ రికార్డ్స్ వరల్డ్ రైటర్స్ ఫోరం, వరల్డ్ పోయెట్రీ అకాడమీ ఆధ్వర్యంలో ఇచ్చే తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారానికి నాగమణి ఎంపికయ్యారు. ఈనెల 21న విజయవాడలో జరిగే కార్యక్రమంలో పురస్కారం అందుకోనున్నారు. ఈ మేరకు ఆహ్వానం అందుకున్నారు.

ముప్పాళ్లలో జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు

ఈపూరు(శావల్యాపురం): సంక్రాంతి పర్వదినం పురస్కరించుకొని ఈపూరు మండలం ఆరేపల్లి ముప్పాళ్ల గ్రామంలో రైతుమిత్ర కమిటీ సారథ్యంలో 33వ జాతీయస్థాయి కబడ్డీ పోటీలను రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ రైతుమిత్ర, గ్రామస్తులు, దాతల సౌజన్యంతో గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి పోటీలు నిర్వహించటం అభినందనీయమన్నారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా గత 33 ఏళ్ల నుంచి కబడ్డీ పోటీలు నిర్వహించటం శుభ పరిణామమన్నారు. అనంతరం క్రీడాకారుల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈనెల 17 వరకు పోటీలు జరుగుతాయని కమిటీ ప్రతినిధి తల్లపనేని రామారావు తెలిపారు. పోటీలు ముగిసే వరకు క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందీ తలెత్తకుండా అన్ని సౌకర్యాలూ కల్పించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సూరె కోటేశ్వరరావు, పులి శ్రీనివాసరెడ్డి, మద్దినేని శ్రీనివాసరావు, ఇడపలపాటి హనుమయ్య, రాపర్ల జగ్గారావు పాల్గొన్నారు.

టీఎన్‌టీయూసీ బలవంతపు సభ్యత్వ నమోదు సిగ్గు చేటు



కార్యాలయ సమావేశంలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

నరసరావుపేట: సంఘ చరిత్ర, చేసే పోరాటాలపై ఆకర్షితులై సంఘంలో చేరాలే కానీ, దీనికి విరుద్ధంగా బలవంతంగా యూనియన్‌లో చేర్చుకోవాలని తెలుగునాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ (టీఎన్‌టీయూసీ) వ్యవహరించడం సరికాదని సీఐటీయూ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయ నాయక్ ధ్వజమెత్తారు. కోటప్పకొండ రోడ్డులోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ టీఎన్‌టీయూసీ సభ్యత్వ నమోదు ప్రక్రియపై మండిపడ్డారు. జిల్లాలో అంగన్‌వాడీలు టీఎన్‌టీయూసీలో తప్పకుండా చేరాల్సిందేనంటూ నేరుగా టీడీపీ నాయకులే ఫోన్‌చేసి బెదిరించడం, భయభ్రాంతులకు గురిచేయడం తగదన్నారు. ఐక్య పోరాటాలు చేస్తున్న సీఐటీయూను విచ్ఛిన్నం చేసేందుకే టీఎన్‌టీయూసీ సభ్యత్వ నమోదు పేరిట కొత్త తరహా వేధింపులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమారి, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కేపీ మెటిల్డాదేవి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజకీయ వేధింపుల ద్వారా ఆ పార్టీకి చెందిన మహిళలకు అంగన్‌వాడీ పోస్టులు కట్టబెట్టేందుకు చేసిన యత్నాలను యూనియన్ ఆధ్వర్యంలో ఎండగట్టి ఎందరో అంగన్‌వాడీలకు అండగా నిలిచామని అన్నారు. ఇది ఓర్వలేని అధికారపార్టీ నాయకులు బలంగా ఐక్యంగా ఉన్న తమ యూనియన్‌ను విచ్ఛిన్నం చేసేందుకు చేస్తున్న కుట్రలలో భాగంగా బలవంతపు సభ్యత్వ నమోదు ప్రక్రియకు తెరలేపారన్నారు. గత ఐదేళ్ల పాలనలో తమ హక్కులు, డిమాండ్ల సాధనకు సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు అనేక పోరాటాలు చేశారని, అప్పుడు వారి పోరాటాలకు కనీసం మద్దతు కూడా తెలపని టీఎన్‌టీయూసీ ప్రస్తుతం అధికారాన్ని అడ్డం పెట్టుకొని కొత్త తరహా రాజకీయాలు చేస్తున్నారన్నారు.

‘పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించండి’



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న కేఎస్ లక్ష్మణరావు

సత్తెనపల్లి: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షక, వివిధ ప్రజా సమస్యలపై పనిచేస్తున్న తనను కృష్ణ, గుంటూరు గ్రాడ్యుయేట్ నియోజకవర్గ అభ్యర్థిగా గెలిపించాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక,పెన్షనర్స్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ తదితర ప్రజా సంఘాలతో ఆదివారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. సమావేశానికి యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి చిన్నం శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. సమావేశంలో పాల్గొన్న వివిధ ప్రజాసంఘాల వక్తలు మాట్లాడుతూ 2007 నుంచి 2025 వరకు ఎమ్మెల్సీగా పనిచేస్తూ వచ్చిన కేఎస్ లక్ష్మణరావు నిరుద్యోగ, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను శాసన మండలిలో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేశారన్నారు. ఆయా సమస్యలపై జరుగుతున్న ఉద్యమాలలో ఆయన ప్రత్యక్షంగా పాల్గొని బాధితుల తరుపున న్యాయం కోసం పోరాడేవారన్నారు. అటువంటి కేఎస్ లక్ష్మణరావు గెలుపు కోసం అన్ని ప్రజాసంఘాల వారు నిర్విరామంగా కృషి చేసి గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం సత్తెనపల్లి నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లోని పోలింగ్ బూత్‌ల వారీగా బూత్ సమన్వయ కమిటీలను ఏర్పాటు చేసి కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. సమావేశంలో యూటీఎఫ్, పెన్షనర్స్, వివిధ ప్రజా సంఘాల నాయకులు కె.శ్రీనివాస రెడ్డి, ఎం.మోహన్‌రావు, ప్రేమ్ కుమార్, కిషోర్ కుమార్, ఏ వెంకటేశ్వరరావు, ఎస్.కె.షరీఫ్ పాషా, జి.చలమయ్య, పి.మహేష్, జి.బాలకృష్ణ, డి.విమల, జి.ఉమాశ్రీ, జె.రాజ్‌కుమార్, ఎం.హరిపోతురాజు, జి.లక్ష్మీనారాయణ, జి.రజని, పి.యిర్మియ, పి.పాములయ్య, జి.రవిబాబు, కె.సుజాత, కేబీఆర్జే ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యా సంవత్సరం ప్రాతిపదికన బదిలీలు చేపట్టాలి

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్ర ప్రభుత్వం విద్యా సంవత్సరం ప్రాతిపదికన బదిలీలు చేపట్టాలని ఫ్యాప్టో చైర్మన్ బెజ్జం సంపత్‌బాబు, సెక్రటరీ జనరల్ వి.అశోక్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. 2017 నుంచి అమలులో ఉన్న ఈ విధానాన్ని వదిలి కటాఫ్ తేదీ ప్రాతిపదికన బదిలీలు చేస్తే పల్నాడు వంటి పెద్ద జిల్లాల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు 2023లో ప్రమోషన్ పొందిన సీనియర్లకు న్యాయం చేసే అవకాశం లేదని వివరించారు. కొత్త జిల్లాల ఏర్పాటు నేపథ్యంలో ఉపాధ్యాయులు తమ స్వంత ప్రాంతాలకు వెళ్లేందుకు వెసులుబాటు ఉంటుందని వివరించారు. ప్రధానోపాధ్యాయులకు ఐదేళ్లు, ఉపాధ్యాయులకు ఎనిమిదేళ్లు లాంగ్ స్టాండింగ్‌గా పరిగణించాలని కోరారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

మేడికొండూరు: బైకును గుర్తు తెలియని వాహనం బలంగా ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని పేరేచర్ల గుంటూరు రోడ్‌లోని చంద్రయ్య పెట్రోల్ బంకు వద్ద ఆదివారం తెల్లవారుజామున జరిగింది. ఏలూరు జిల్లా కలిదిండి గ్రామానికి చెందిన భాగ్య రమేష్ (30) గుంటూరు నుంచి ద్విచక్ర వాహనంపై పేరేచర్ల వస్తున్నాడు. మార్గమధ్యలో చంద్రయ్య పెట్రోలు బంకు వద్దగుర్తుతెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే దుర్మరణం చెందాడు.

అత్తారింటి ముందు కోడలి ఆందోళన

ఇంట్లో రానివ్వకుండా తాళాలు వేసి వెళ్లారని ఆరోపణ



అత్తారింటి ముందు కుటుంబ సభ్యులు, పసికందుతో ఆందోళన చేస్తున్న చందన

నాదెండ్ల: మూడు నెలల బాలింత అత్తారింటి ముందు టెంటు వేసుకొని ఆందోళనకు దిగిన ఘటన ఆదివారం జరిగింది. బాధిత మహిళ కథనం ప్రకారం.. అమీన్‌సాహెబ్‌పాలెంలో విరిగిన ఎముకలకు కట్లు కట్టే పూనాటి వీరయ్య చౌదరి, నాగరత్నమ్మకు ముగ్గురు సంతానం. రెండో కుమారుడైన పూనాటి వీరేంద్రచౌదరికి ఉప్పలపాడు గ్రామానికి చెందిన ఈదర వెంకట సుబ్బారావు కుమార్తె చందనతో 2018 డిసెంబర్‌లో పెళ్లయింది. ప్రస్తుతం వీరు చిలకలూరిపేటలో నివాసం ఉంటున్నారు. మూడు నెలల కిందట ఒక పాపకు చందన జన్మనిచ్చింది. మూడు నెలలు దాటే ముందు అత్తారింట్లో కోడలు నిద్ర చేయాలన్న సంప్రదాయంతో అత్త నాగరత్నమ్మను ఫోన్లో సంప్రదించారు. సరైన సమాధానం లభించకపోవడంతో బిడ్డను తల్లిదండ్రులను తీసుకొని చందన శనివారం అత్తగారి ఊరైన అమీన్‌సాహెబ్ పాలెం చేరుకుంది. వీరు అక్కడికి వచ్చే సరికి ఇంటికి తాళాలు వేసుకొని అత్తారింటి కుటుంబ సభ్యులు ఎక్కడికో వెళ్లారు. తాము వస్తున్నట్లు గ్రహించిన వారు తాళాలు వేసుకొని వెళ్లడంతో చందన టెంట్ వేసుకొని ఆందోళనకు దిగారు. ఇంట్లో తనకు వాటా ఉందంటూ ఆందోళన చేశారు. సమాచారం తెలుసుకున్న నరసరావుపేట పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని చర్చలు జరుపుతున్నారు. ఘటనపై అత్త నాగరత్నమ్మ మాట్లాడు తూ తన భర్త వీరయ్య చౌదరి మూడేళ్ల కిందట గుండెపోటులో మృతి చెందారని, ఆయన బతికి ఉన్నప్పుడే అందరికీ ఆస్తి పంపకాలు చేశారని, చిన్న కోడలైన చందన తన తమ్ముడి కుమార్తేనని వివరించారు.

కృష్ణానదిలో గుర్తు తెలియని మృతదేహం

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కనకదుర్గ వారధి కింద కృష్ణానదిలో గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్లు ఆదివారం తాడేపల్లి పోలీసులకు మత్స్యకారులు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెళ్లి కనకదుర్గ వారధి కింద 16వ దిమ్మె వద్ద నీటిలో తేలియాడుతున్న మృతదేహాన్ని వెలికి తీయించారు. మృతుడి వివరాలు తెలిపే ఎటువంటి ఆధారాలు లభించలేదు. సుమారు 35 సంవత్సరాల వయస్సు ఉండవచ్చని, శరీరంపై నల్ల నిక్కర్, తెలుపు ఎరుగు అడ్డగీతల టీషర్ట్ ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాజకీయ జోక్యం తగదు



మాట్లాడుతున్న నక్కా వెంకటేశ్వర్లు

గుంటూరు ఎడ్యుకేషన్: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాజకీయ పార్టీల జోక్యం తగదని, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం కృష్ణా-గుంటూరు జిల్లాల పీడీఎఫ్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా కేఎస్ లక్ష్మణరావును తిరిగి గెలిపించుకుందామని తెలిపారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ గుంటూరు జిల్లా కార్యాలయంలో ఆదివారం ముఖ్యుల సమావేశాన్ని సంఘ జిల్లా అధ్యక్షుడు యు.రాజశేఖర్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. 2007 నుంచి పీడీఎఫ్ ఎమ్మెల్సీలు ప్రజల పక్షాన నిలిచి, ప్రజాతంత్ర హక్కులను కాపాడడం కోసం కృషి చేశారని తెలిపారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల విభాగ చైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ... ప్రణాళికాబద్ధంగా ప్రచారం చేస్తే విజయం ఖాయమని తెలిపారు. ఈ ఎన్నికల్లో రాజకీయ పార్టీలు జోక్యం చేసుకోవడం తగదన్నారు. యూటీఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్, ఎం.కళాధర్‌లు మాట్లాడుతూ... విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. సమావేశంలో యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షురాలు వై.నాగమణి, కోశాధికారి ఎండీ దౌలా, నాయకులు సీహెచ్ ఆదినారాయణ, బి.ప్రసాదు, కోటిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు గోపయ్య, రమేష్, శ్రీనివాస్ కార్తీక్, శ్రీనివాసరావు, ఉదయభాస్కర్, ఆదం సాహెబ్, కిషోర్, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

తెనాలి రూరల్: రైలు నుంచి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన పెదవడ్లపూడి స్టేషన్ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. సుమారు 60 ఏళ్ల వయసున్న వ్యక్తి తాంబరం ర్లో రైలు నుంచి జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి ఒంటిపై తెల్ల చొక్కా ఉంది. సమాచారం అందుకున్న తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాల మార్చురీకి తరలించారు.